లక్ష్యం.. శతశాతం



ప్రతి విద్యార్థికి టెన్త్ కీలకం. భవిష్యత్తు బంగారుబాటలో నడవాలంటే పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ప్రతిభ నిరూపించుకోవాల్సిందే. కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించడం నల్లేరు మీద నడకే అంటున్నారు నిపుణులు. **అయితే టెన్త్ పబ్లిక్ పరీక్ష కావడంతో విద్యార్థుల్లో భయం** నెలకొంటుంది. **అటువంటి విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్టి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో ప్రభుత్వ** పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు.

- **టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా కృషి**
- **ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు**
- **సత్ఫలితాలిస్తోన్న వంద రోజుల ప్రణాళిక**
- **రైల్వే హైస్కూల్ విద్యార్థుల ఉన్నతికి శ్రమిస్తోన్న ఉపాధ్యాయుల**

అల్లిపురం: మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు టెన్త్ ఫైనల్ పరీక్షలు జరగనుండటంతో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేస్తున్నారు. రైల్వే క్వార్టర్స్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రైల్వే హైస్కూల్) నుంచి ఈ విద్యా సంవత్సరం 87 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంగ్లీష్ మీడియం నుంచి 26 మంది బాలికలు, 61 మంది బాలురు పరీక్షలు రాయనున్నారు.

ప్రణాళికే ముఖ్యం..

పరీక్షలకు చదివేందుకు ప్రణాళిక ముఖ్యం. ఉదయం 5 నుండి 8 గంటల వరకు, సాయంత్రం 7 నుండి 10 గంటల వరకు చదువుకు కేటాయించుకోవాలి. మ ధ్యాహ్నం డ్రాయింగ్, ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, వ్యాకరణం ప్రాక్టీస్ చేయడం వల్ల సమయం కలిసి వస్తుంది.



రైల్వే హైస్కూల్‌లో పాఠాలు వింటున్న టెన్త్ విద్యార్థులు



రైల్వే హైస్కూల్ ముఖద్వారం

విద్యార్థుల స్థాయిని బట్టి బోధన..



ఎఫ్ఏ1, ఎఫ్ఏ2లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏ,బీ,సీ,డీ గ్రేడ్లుగా విద్యార్థులను విభజించి, వారి అభ్యసనా సామర్థ్యాన్ని బట్టి బోధిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులు కూడా సబ్జెక్టుల్లో కనీసం 35 మార్కులైనా సాధించేలా పలు అంశాలపై ఫోకస్ చేస్తున్నాం.

– ఎం.రాజశేఖరరావు, ప్రధానోపాధ్యాయులు, రైల్వే హైస్కూల్

అదనపు తరగతులు..

ప్రతి రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణ పని వేళల కంటే ఉదయం ఒక గంట, సాయంత్రం గంటన్నర అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరొక సబ్జెక్టు చదివిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. డీసీఈబీ ఇచ్చిన పేపర్లతో ప్రతి వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు, గ్రాండ్ టెస్ట్ మార్చి 3 నుంచి 8 వరకు, ఫైనల్ పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి 31 వరకు నిర్వహిస్తారు.

సబ్జెక్టులపై విద్యార్థులకు పట్టు ఉంది..



ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించారు. ప్రతి రోజూ రెండు పూటలా దగ్గరుండి రివిజన్ చేయిస్తున్నాం. ఈ సారి మంచి ఫలితాలు సాధిస్తాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

– కె. మదీనావలీ, పీఎస్ టీచర్, రైల్వే హైస్కూల్

గ్రామర్‌పై దృష్టి సారించాం



ఇంగ్లీషులో విద్యార్థులు పట్టు సాధించేలా కృషి చేస్తున్నాం. ఇంగ్లీషు మీడియం కావటంతో విద్యార్థులకు లాంగ్వేజ్‌పై పూర్తిగా అవగాహన ఉంది. ఇంగ్లీషు సబ్జెక్టులో మంచి మార్కులు వస్తాయి. శత శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

– పి.సుధ, ఇంగ్లీషు టీచర్



రైల్వే క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రైల్వే హైస్కూల్)

ఉపాధ్యాయుల గైడెన్స్ బాగుంది..

ఉపాధ్యాయులంతా బాగా గైడ్ చేస్తున్నారు. రోజూ అదనపు తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. వచ్చిన మార్కులను బట్టి వెనుక బడిన సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించేలా సలహాలు ఇస్తున్నారు.

–జి.కార్తికేయ శర్మ, టెన్త్ విద్యార్థి రైల్వే హైస్కూల్



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..

వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో సబ్జెక్ట్ అర్థమై టెన్త్‌లో మంచి మార్కులు సాధించగలమని నమ్మకం కలుగుతోంది.

–ఎం.దేవహర్ష, పదవ తరగతి విద్యార్థి



క్లుప్తంగా

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: వెంకటకేశ్వరమెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణ మూర్తి దేవాలయంలో మాఘ మాసం మొదటి ఆదివారం సందర్భంగా దేవాలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి స్వామికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

శివరామకృష్ణ దేవాలయంలో..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు చేపట్టి భక్తులకు దర్శనాలు కల్పించారు.

చక్కని విలువలు గల చిత్రం 'స్టూడెంట్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హీరో సుమన్ తదితరులు

అల్లిపురం: చక్కని విలువలు కలిగిన చిత్రం 'స్టూడెంట్' అని హీరో సుమన్ అన్నారు. శ్రీ సాయి మాతా క్రియేషన్స్ బ్యానర్‌పై పి.సాయిరాం దర్శకత్వంలో నిర్మించిన ఆ చిత్రం పోస్టర్‌ను హోటల్ గ్రీన్‌పార్కులో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులంతా ఈ చిత్రాన్ని చూడాలన్నారు. ఈ చిత్రంలో గుర్తుండిపోయే పాత్ర చేశానన్నారు. ఆ పాత్ర తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. దర్శకుడు సాయిరాం మాట్లాడుతూ ఇది చక్కటి సందేశాత్మక చిత్రమన్నారు. నటీనటులంతా బాగా నటించారని తెలిపారు. సీనియర్ నటులు సుమన్, సుధ, జబర్దస్త్ అప్పారావు, సత్తి పండు నటించగా, హీరోగా విద్యాసాగర్, ముఖ్య పాత్రలో రవితేజ నటించారన్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం తాను వహించగా, ప్రతాప్ సంగీతం అందించారన్నారు. ప్రేక్షకులు తమ చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

అలరించిన త్యాగరాజ పంచరత్న సేవ



పంచరత్న సేవలో పాల్గొన్న గాయనీమణులు

సీతంపేట: కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో స్థానిక బీవీకే కళాశాలలో శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం పంచరత్నాకర సేవ జరిగింది. పలువురు గాయనీమణులు పాల్గొని త్యాగరాజ స్వామి కృతి పర్చిన జగదానంద కారక, దుడుకు గల , సాధించెనే, కనకన రుచిరా, ఎందరో మహానుభావులు కీర్తనలు ఆలపించి త్యాగరాజ స్వామికి సంగీత సేవ నిర్వహించారు. సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన గాయకుడు శ్రీరామ్ జొన్నలగడ్డ ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించిన త్యాగరాజ కీర్తనల పోటీలో సుమారు 250 మంది పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకులు నిష్టల కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, బీవీకే చైర్మన్ ఆచార్య జి. నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు

మురళీనగర్ : వాకర్స్ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నడక పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను 41-50, 51-60, 61-70, 70 ఆపైన వయసు కలిగిన పురుషులు, మహిళలకు నిర్వహించారు. పోటీల్లో 93 మంది పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 4న నిర్వహించే వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో వాసుపల్లి జన్మదిన వేడుకలు



అభిమానులు, యువతతో కలిసి రక్తదానం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



వాసుపల్లిని గజమాలతో సత్కరిస్తున్న జానకీరామ్, జాన్‌వెస్లీ తదితరులు

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమాల్లో పండ్లు పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు నిర్వహించారు. 104 ఏరియాలో వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అధ్యాపక సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి గజమాలతో సత్కరించారు. వాసుపల్లి కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే అమ్మ బ్లడ్ బ్యాంక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరు వార్డుల నాయకుల సారథ్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 104 ఏరియాలో గల వాసుపల్లి కార్యాలయంలో అభిమానులు, యువతతో కలిసి వాసుపల్లి కూడా రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండా రాజీవ్‌గాంధీ, మాజీ క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, మూగి శ్రీనివాస్, దొడ్డి కిరణ్, జిల్లా బీసీ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, తోట పద్మావతి, వార్డు నాయకులు అలపన కనకరెడ్డి, సర్వేశ్వర రెడ్డి, దశమంతుల చిన్ని, దొడ్డి రామానంద్, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, దొడ్డి బాపూ ఆనంద్, ముత్తాబత్తుల రమేష్, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, వాసుపల్లి బంగారమ్మ, లింగం శ్రీను, తాడి రవితేజ, మహ్మద్ షకీల్, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, వాసర్ల సుబ్రహ్మణ్యం, పిల్లి అప్పారావు, గనగళ్ల రామరాజు, డేవిడ్‌రాజు, బెవర మహేష్, సూర్య, కొణతాల కృష్ణవేణి, సుధ, బోరా శ్రీనివాసరెడ్డి, పాటోజు అర్జున్, గురజాపు రవి, చింతకాయల వాసు, ఆకుల యేసు, నొల్లు పోతుస్వామి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు వాసుపల్లి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇటీవల విడుదల చేసిన స్టీల్‌ప్లాంట్ నిధులు కేవలం అప్పులు తీర్చడానికి మాత్రమే సరిపోయినప్పటికీ, ఏపీలో కూటమి నేతలు మాత్రం సమస్యంతా తీరిపోయినట్టు భజనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

9 నుంచి శ్రీలలితాపీఠం బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: శ్రీలలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విశేష పూజా కార్యక్రమాలతో వైభవంగా జరుగుతాయని పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ మహాస్వామి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్తాళం శంకరాచార్యులు, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీసులతో మాఘ శుద్ధ ద్వాదశి నుంచి మాఘ పౌర్ణమి వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ 9న ఉత్సవాలకు అంకురార్పణ, 10వ తేదీ ఉదయం లలితా కామేశ్వరుల కల్యాణోత్సవం, 11వ తేదీ ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం, అనంతరం బంగారు చీరలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. 12వ తేదీన భక్తుల లలితా దీక్ష విరమణలు, గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకునే వరకు పోరాటం



జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షకు జగదాంబ జోన్ కమిటీ కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఒక వ్యక్తికి సంబంధించినది గాని ఒక సంస్థకు సంబంధించినది గానీ కాదన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో ఇది వచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికలు తప్ప ప్రజల సంక్షేమం పట్టదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ని చూస్తే తేటతెల్లమవుతుందని అన్నారు. ఆనాడు రైతులు నల్ల చట్టాలు రద్దు చేయాలంటూ పోరాటం చేసినా, 700 మందికి పైగా రైతులు అసువులు బాసినా పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు సమీపించేసరికి సాక్షాత్ ప్రధాని మోదీ బహిరంగంగా రైతులకు క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను రద్దు చేశారని అన్నారు. ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో మధ్య తరగతికి మేలు చేసే బడ్జెట్‌గా ఈ బడ్జెట్ ను అభివర్ణిస్తూ ఢిల్లీ గద్దె లక్ష్యంగా ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గత బడ్జెట్ తో పోల్చుకుంటే ఈ బడ్జెట్ 5 శాతం పెంచి ప్రవేశపెట్టినప్పటికీ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధి, యూరియా సబ్సిడీలపై బడ్జెట్‌లో కోతలు విధించడం బీజేపీ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక నైజాన్ని బట్టబయలు చేస్తున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పాగా వేసేందుకు ఎన్ని కుయుక్తులు పన్నినా విఫలం కావడంతో స్టీల్‌ప్లాంట్‌కి అరకొర నిధులు విదిలించి మోసం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించడం వంటి కార్యక్రమాలు నిర్వహించకపోతే ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు వై. రాజు, ప్రొఫెసర్ సూరప్పుడు, సంతోష్, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



బల్లల పండగ నిర్వహిస్తున్న దృశ్యం

మద్రిపాలెం: ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బల్లల పండగలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం సభ్యులు, మహిళలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే మాధవధార మామిడితోటలో విశాఖ లైటింగ్స్ అండ్ సౌండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఆయనను సత్కరించారు.

ఘనంగా ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం, వసంత పంచమి వేడుకలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రినాథమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ భావం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సంఘం రాష్ట్ర నాయకుడు అప్పారావు శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి విశ్వనాథం, మహిళా కార్యదర్శి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువ బ్యాంక్ మేనేజర్లకు అవగాహన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఉత్తరాంధ్ర ఐదు జిల్లాల బ్రాంచ్ మేనేజర్ల ప్రాంతీయ సదస్సు ఆదివారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ప్రాముఖ్యత, డిపాజిట్లు, అడ్వాన్స్‌లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యువ బ్యాంక్ మేనేజర్లను అభినందిస్తూ వ్యవస్థగా బ్యాంక్ చేయగలిగే కార్యక్రమాల గురించి వివరించారు. బ్యాంక్ విశాఖ రీజియన్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ విద్యాధర్, ఏజీఎం రియాజ్, రీజియన్ మేనేజర్లు, యూనియన్ జనరల్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం



చిత్తడి నేలల నమూనాతో వృక్షశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకులు విద్యార్థినులచే చిత్తడి నేలల నమూనాను ఏర్పాటు చేసి పోస్టర్ ద్వారా చిత్తడి నేలల ప్రాముఖ్యత తెలిపారు. భారతదేశంలో గల 85 చిత్తడి నేలలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల విద్యార్థినులను అభినందించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి టీఎంప నివేదిత బయో డైవర్సిటీ సంరక్షణకు చిత్తడి నేలలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ జె. లావణ్య, ఐక్యూసీ కో ఆర్డినేటర్ ఎస్. అనూష, అకడమిక్ సెల్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ లలితా శరణ్య, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పడుతున్నా పట్టించుకోరా?

- కంకర తేలిన కొత్తగా నిర్మించిన కల్వర్టు
- జారి పడుతున్న వాహన చోదకులు



ప్రమాకరంగా మారిన సాయిబాబా వీధిలోని కల్వర్టు



కల్వర్టుపై తేలిన కంకర పిక్కలు

అల్లిపురం: ప్రతిరోజూ జారి పడుతున్నా పట్టించుకోరా అని వాహన చోదకులు జీవీఎంసీ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. నెల రోజుల క్రితం సాయిబాబావీధి నుంచి గోవింద్ రోడ్డుకు వెళ్లే రోడ్డులో జీవీఎంసీ కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మించారు. నిర్మాణంలో సరైన సిమెంట్ పాలు వేయకపోవటంతో కంకర పిక్క తేలిపోయింది. కార్నర్‌లో వాహనాలు తిరుగుతున్నప్పుడు వాహన చోదకులు జారి పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై గతంలో పత్రికలో ప్రచురించినా జీవీఎంసీ సిబ్బంది నుంచి ఎటువంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది, అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో కల్వర్ట్‌ను కట్టుదిట్టంగా నిర్మింపజేయాలని కోరుతున్నారు.

చిన్నారులను ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్

సీతంపేట: విశాఖ పౌరగ్రంథాలయం, భారతీయ విద్యాభవన్స్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన మియావాకీ స్టోరీ సెషన్ అలరించింది. ప్రముఖ కథకులు ఎం.సీతా శ్రీనివాస్ చైనీస్ న్యూఇయర్ సంప్రదాయాలను ఆకర్షణీయమైన కథ ద్వారా పిల్లలకు వివరించారు. చైనీస్ న్యూఇయర్ వేడుకలు, అదృష్టాన్ని సూచించే డ్రాగన్స్, దుష్టశక్తులను పారదోలే తాళాలు, ఎరుపు రంగు అదృష్టానికి చిహ్నంగా చైనీస్ నమ్ముతారని, వారి ఆచార సంప్రదాయాలను కథ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 80 మంది పిల్లలు పాల్గొన్నారు.